
# తండ్రి మనసు

## ప్రతాప రవిశంకర్



“రండి మామయ్యగారూ” అన్నది సువర్చల గేటు నెట్టుకుని లోపలకు వస్తున్న శేషాచలాన్ని చూసి ..

గుమ్మందగ్గరకు వచ్చిన తర్వాత ఆయన చేతిలోనించి సంచీ తీసుకుని కాళ్లు కడుక్కోటానికి నీళ్లు ఇస్తూ “కులాసాయేనా?” అనడిగింది

“ఆ” అంటూ ఆయన నీళ్లు అందుకున్నాడు.

లోనికివెళ్లింది సువర్చల

“ఎవరూ వచ్చిందీ ?” అడిగాడు గుర్నాధ శర్మ.

“చిన్న మామయ్యగారు” అన్నది సువర్చల సంచీని గోడవారగా వుంచి

“బాగున్నావా అన్నయ్యా” అంటూ లోపలకు వచ్చాడు శేషాచలం

“నువ్వా శేషూ . ఎక్కడినించీ రావటం?” అన్నాడాయన.

“రెండోవాడు సుదర్శనం ఇంటినించే” అన్నాడు అన్నయ్య ఎదురుగా కూర్చుంటూ కుర్చీలో —

“సుదర్శనం ఇంట్లో అంతా బావున్నారా ?”

“ఆ అందరూ నిక్షేపంగా వున్నారు” అన్నాడు సువర్చల ఇచ్చిన మంచినీళ్లు అందుకుంటూ —

“బావున్నారా మామయ్యా” అంటూ వచ్చి శేషాచలాన్ని పలకరించింది ఆ ఇంటికి రెండో కోడలు అనసూయ.

తల వూపాడు శేషాచలం

సాయంత్రం నాలుగ్గంటల సమయం . కిటికీ లోనించి పలుచని ఎండ లోపలకు పడుతోంది

కోడళ్లిద్దరూ లోపలకు వెళ్లిపోయారు వారిభర్తలు ఇంకా ఆఫీసులనించి ఇంటికి తిరిగి రాలేదు. ఇంకో అరగంట తర్వాతగానీ వారి పిల్లలు స్కూలునించి తిరిగి రారు.

పదినిముషాల తర్వాత అనసూయ రెండు గ్లాసులతో హార్లిక్స్ తీసుకువచ్చి ఇద్దరు మామగార్లకీ ఇచ్చి వెళ్లిపోయింది.

డా॥ వి. వి. కె. రావ్, BA



వైద్య విద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్
వివాహము వాయిదా వేయ నవసరం లేదు హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్కలనము లకు ఆయుర్వేద చికిత్స పోస్టుద్వారా చికిత్స కలదు.

**రావూస్ క్లినిక్**
టి బి రోడ్, తెనాలి
ఫోన్ 3700 & 4010

PENS BALLPENS
DIVYA®
A JAI PRODUCT
INKS REFILLS

**డా. కె.యల్. నారాయణ**



వైద్యవిద్వాన్, వైద్యాచార్య
చర్మవ్యాధులకు, స్త్రీల వ్యాధులకు, పక్షవాతం, సుఖ వ్యాధులకు, సెక్సు, నరముల బలహీనతలకు, ఆయుర్వేద చికిత్స
పోస్టుద్వారా చికిత్స కలదు
**లక్ష్మీ కుమారి క్లినిక్,**
మెయిన్ రోడ్, తెనాలి

## మనవి

డాక్టర్ సలహాలు, ప్రశ్నావళి శీర్షికలకి ప్రశ్నలు పంపేవారు తాము పంపే శీర్షిక పేరు రాసి కేరాఫ్ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగర్, విజయవాడ – 520 003 అన్న చిరునామాకి పంపాలి. రాసిన వారి పూర్తి పేరు, చిరునామా యివ్వడం ఎంతైనా అవసరం. —సం.

# తండ్రి మనసు

తన అన్నయ్య కోడళ్ల మర్యాదలూ, వారి వినయ విధేయతలూ చూస్తుంటే శేషాచలానికి గుండెల్లో ఏదో ముల్లు గుచ్చుకున్నట్టు అనిపించింది

“ఊ ఏమిటిరా విశేషాలు ?” అడిగాడు గుర్నాధశర్మ తమ్ముడిని

“ఏమున్నాయ్ నా కొడుకులిద్దరికి నేను భారమయి పోయాను నిన్నటివరకూ రెండోవాడి దగ్గర వున్నాను ఈరోజు వాడు కూడా నాకు తన ఇంట్లో చోటు లేదని చెప్పేశాడు భార్య మాటలు విని చిన్నకోడలు శారద కూడా ఉదయమే చెప్పేసింది ఎక్కడికయినా వెళ్లి పొమ్మని వేరే దారి లేకపోతే అడుక్కుని బతకమన్నది పెద్దవాడు తన ఇంటి గుమ్మం తొక్కవద్దని ఎప్పుడో చెప్పేశాడు కదా ! ఎటు వెళ్లాలో తెలీక ముందుగా ఇక్కడికి వచ్చాను హు వంట్లో శక్తి వున్నంతకాలం నా పిల్లలు నా సంసారం అంటూ వాళ్లకోసం తాపత్రయపడి పోయాను అందుకు ప్రతిఫలంగా వాళ్లిద్దరు నాకు ఈ గతి పట్టించారు” అన్నాడాయన విచారంగా

కొడుకులిద్దరూ తన తమ్ముడిని ఇళ్లల్లో నించి గెంటివేశారని వినగానే గుర్నాధశర్మ హృదయం బాధతో కొట్టుకున్నది

ఆయన ఆ రోజుల్లోనే చదువుకుని మాస్టరు ఉద్యోగం సంపాదించాడు శేషాచలం అంతగా చదువుకోలేదు అందుకే కిరాణాషాపులో పని చేస్తూ చాలీచాలని సంపాదనతో కొడుకులిద్దరినీ పెంచాడు పెద్దకొడుకు సోమేశ్వర్ ఇంటర్ వరకు చదువుకుని ఓ గవర్నమెంటాఫీసులో ఉద్యోగం సంపాదించాడు రెండో కొడుకు సుదర్శనం అంతగా చదువుకోలేదు తండ్రిలాగే ఓ ఫ్యాన్సీషాపులో పనికి కుదిరాడు

తాజా వార్తలకు
నిజమైన వార్తలకి
న్యాయమైన
వ్యాఖ్యలకి
ఆంధ్రపత్రిక
చదవండి!

శేషాచలం భార్య ఆరేళ్ల క్రితమే ఓ జబ్బుతో పోయింది గుర్నాధశర్మ కొడుకులిద్దరూ బాగానే చదువుకున్నారు పెద్దకొడుకు విశ్వనాధంకు రెవెన్యూ డిపార్టుమెంటులో ఉద్యోగం రెండో కొడుకు గోపాలంకి బ్యాంకులో ఉద్యోగం అంతా కలిసే వుంటున్నారు నాలుగేళ్ల క్రితం గుర్నాధ శర్మ భార్య గుండెపోటుతో చనిపోయింది అప్పటి నించీ కోడళ్లిద్దరూ ఆయన అవసరమేమిటో గుర్తిస్తూ ఆయన మనసు నొచ్చుకోకుండా సేవలు చేస్తున్నారు కొడుకులిద్దరూ తండ్రిని అపురూపంగా చూసుకుంటున్నారు

అన్నదమ్ములిద్దరి జీవితాలకి అంతటి వ్యత్యాసం వుండటం గుర్నాధశర్మకి చాలా మనస్తాపాన్ని కలిగించింది

“నేను నిజంగా చాలా అదృష్టవంతుడనిరా శేషూ నా కొడుకులూ, కోడళ్లూ నన్నో దేవుడిగా చూసుకుంటున్నారు ఈ అదృష్టానికి నేనెంతో గర్వపడుతున్నాను వృద్ధాప్యంలో వారి ప్రేమ, అభిమానం నాకో వరంగా భావిస్తున్నాను” అన్నాడు గుర్నాధశర్మ తమ్ముడితో—

“అవును ఇక నా దృష్టిలో నావాళ్లంతా లేనట్టే వాళ్లు మరమనుషులు ఇక నాజీవితం ఇలా వెళ్లిపోవలసిందే” అన్నాడు శేషాచలం బాధగా

వాళ్లలా మాట్లాడుకుంటున్నప్పుడే పిల్లలు స్కూలునుంచి వచ్చారు వస్తూనే శేషాచలాన్ని చూసి “చిన్న తాతయ్యా” అంటూ ఆయన దగ్గిరికి వచ్చారు వాళ్లందరినీ నవ్వుతూ పలకరించాడు శేషాచలం

ఆరుగంటలు కావస్తున్నప్పుడు విశ్వనాధం—గోపాలం ఇంటికి వచ్చారు! వస్తూనే తండ్రితో మాట్లాడుతున్న శేషాచలాన్ని చూసి సంతోషంగా నవ్వుతూ పలకరించారు

వారి అభిమానం ఆయనికి సంతోషాన్ని కలిగించింది

కొంచెం సేపటి తర్వాత గుర్నాధశర్మ కొడుకులిద్దరికీ, కోడళ్లకీ శేషాచలం కొడుకులు తండ్రిపట్ల చూపిన ఆదరణ గురించి వివరంగా చెప్పాడు వాళ్లంతా ఆయన అనుభవించిన బాధలకు ఎంతో నొచ్చుకున్నారు

“బాబాయ్ ఇకనువ్వు వాళ్ల గురించి మరచిపో ఈ రోజునించీ నువ్వు కూడా మా కుటుంబంలో ఒకడివి మేమే నీ కొడుకులం అనుకో ఈ ఇల్లు నీ ఇల్లే అనుకో నువ్వు మాకు భారం కాదు ఏరా గోపాలం ఇకనించీ బాబాయి మనతోటే వుంటానికి నీకేమైనా అభ్యంతరమా ?” అన్నాడు విశ్వనాధం

“నాకేం అభ్యంతరం లేదు బాబాయ్ మనతోనే కలిసి వుండటం నాకూ సంతోషమే” అన్నాడు గోపాలం

భర్తలిద్దరూ ఆ ఇంటి కోడళ్లనుకూడా

అడిగారు శేషాచలాన్ని ఆ ఇంట్లో వుంచుకోవటం గురించి.

"ఆయన నిజంగానే ఈ కుటుంబంలో మనిషి. మా మామగారి తమ్ముడు మాకు చిన్న మామగారు. ఇక ఆయన మన ఇంట్లో వుండటం మాకు అభ్యంతరం ఎలా అవుతుంది? మాకు ఇష్టమే ఈ ఇంట్లో ఆయనకు ఏ నష్టమూ రాకుండా చూసుకునే బాధ్యత మాది" అన్నారు కోడళ్ళు

అప్పుడు శేషాచలం నిజంగానే ఏడ్చాడు వాళ్ళందరి ఆప్యాయత, అనురాగం ఆయన్ని కదిలించివేశాయి తన తండ్రినేకాకుండా తనని కూడా తండ్రిలాగే చూసుకుంటామని తమ కుటుంబంలో ఒకడిగా భావించిన వాళ్ళందరి సహృదయత ఆయనచేత కంటతడి పెట్టించింది.

తమ్ముడి భుజంమీద చెయ్యివేసి ఆప్యాయంగా నొక్కుతూ "ఒరేయ్ శేషూ అసలు నేనే నిన్ను నాతోపాటే ఈ ఇంట్లో వుండమని అందామనుకున్నాను కాని ఈ సంసార రథాన్ని లాగుతున్న మనుషులు వాళ్ళు అందుకే వాళ్ల అభిప్రాయమేమిటో తెలుసుకున్న తర్వాతనే ఈ విషయం గురించి నేను మాట్లాడదామనుకున్నాను వాళ్ల అభిప్రాయమేమిటో చెప్పారు కదా! ఇప్పుడు నాకు ఇంకా గర్వంగా వుంది నా కొడుకులనూ, కోడళ్లనూ చూస్తుంటే" అన్నాడు.

చిన్న తాతయ్య ఇక ఎప్పటికీ తమఇంట్లోనే వుంటాడని తెలుసుకున్న పిల్లలుకూడా ఎంతో సంతోషం వ్యక్తపరిచారు.

అప్పటికి శేషాచలం ఆ ఇంటికి వచ్చి మూడు నెలలయ్యింది ఈ మూడు నెల్లలోనూ ఆయన మనసు ఎంతగానో కుదుట పడింది తన అన్న కొడుకులూ, కోడళ్ళూ ఆయన్ని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారు ఆయనకి ఎటువంటి బాధా కలగకుండా ప్రవర్తిస్తున్నారు చివరికి పిల్లలు కూడా శేషాచలం అంటే ఎంతో అభిమానాన్ని చూపుతున్నారు

ఆయనకి నిజంగా స్వర్గంలో వున్నట్టుగా వున్నది తమ కన్న కొడుకులూ, కోడళ్లతో వీళ్లందరినీ పోల్చుకున్నప్పుడు ఆయనకు నిజంగా ఎంతో ఆశ్చర్యం కలిగింది

వాళ్ళు సొంత తండ్రిని ఎంతో సులభంగా ఇంట్లోనించి గెంటివేశారు

కాని– వీళ్ళు తన సొంత తండ్రితో సమానంగా తనని చూసుకుంటున్నారు

ఏమిటిదంతా?

నెల రోజుల క్రితం ఒకరోజు సాయంత్రం శేషాచలానికి వున్నట్టుండి ఆయాసం ముంచుకు వచ్చింది

చాలా బాధ పడిపోయాడు

వెంటనే అప్పుడు ఇంట్లోనే వున్న గోపాలం డాక్టర్ని ఇంటికే తీసుకువచ్చాడు ఆయన రాసి ఇచ్చిన మందులను అప్పటికప్పుడు తీసుకు వచ్చాడు.

రెండ్రోజుల్లో శేషాచలం మామూలు మనిషి అయినాడు

తనకు ఎన్నోసార్లు ఇలాగే వస్తే తను బాధపడుతుంటే తన కొడుకులు చూస్తూవూరుకున్నారుగానీ ఒక్కసారికూడా డాక్టర్ని పిలవలేదు మందులు ఇప్పించలేదు

ఏమయినా కొంతవరకు తను అదృష్టవంతుడినని అనుకున్నాడు శేషాచలం

* * *

"ఇప్పుడెందుకురా విశ్వనాథం ఈ డబ్బులు" అన్నాడు శేషాచలం.

"పర్వాలేదులే తీసుకో బాబాయ్ నీ బట్టలు బాగా పాతబడిపోయాయి నీకు ఇష్టమైన బట్టలు కొనుక్కో" అని నూట పాతికరూపాయలు ఇచ్చాడు విశ్వనాథం

శేషాచలం వద్దన్నా విశ్వనాథం బలవంత పెట్టాడు. ఆయనకు తీసుకోక తప్పలేదు

సాయంత్రం ఆరుగంటల సమయంలో శేషాచలం బట్టలు కొనుక్కోటానికి బజారుకు వెళ్లాడు

రోడ్లన్నీ బాగా రద్దీగావున్నాయి జనంతో

మెల్లగా నడుస్తున్న శేషాచలానికి మందుల షాపులోంచి బయటకు వస్తున్న రెండో కొడుకు సుదర్శనం కనిపించాడు

అతనుకూడా తండ్రిని చూశాడు ఇద్దరూ ఒకరికొకరు ఎదురయ్యారు

సుదర్శనం మొహం బాగా వాడిపోయి వున్నది! ఏదో విషాదంలో మునిగిపోయిన వాడిలా కనిపించాడు

"ఏరా. అంతా బావున్నారా?" అనడిగాడు శేషాచలమే కొడుకుని.

"ఏం బాగుండడం పెద్దవాడికి వున్నట్టుండి పెద్ద జబ్బు ముంచుకు వచ్చింది పొద్దున్నే. వాడిని అక్కడే ఆస్పత్రిలోచేర్పించాము డాక్టరు మందులురాసి ఇచ్చాడు అర్జంటుగా తెమ్మని. నా దగ్గర పది రూపాయలకు మించి లేవు. ఈ మందులు వంద రూపాయలు అవుతాయట. ఎక్కడా అప్పు దొరకలేదు. చివరకు నాకు తెలిసిన ఒకాయన ఓ చీటీ రాసి ఇచ్చాడు ఈ వూర్లో తనకు తెలిసిన మందుల షాపు వాళ్ళున్నారని వాళ్ల దగ్గరకు వెళ్లాను ఈ మందులు వాళ్ల షాపులో లేవుట ఇప్పుడు ఏం చెయ్యాలో తెలీక తిరుగుతున్నాను" అన్నాడు విచారంగా–

కొడుకు చెప్పిన మాటలు వినగానే ఒక్కసారి గతాన్నంతా మరచిపోయి ఆయన తండ్రి మనసు ద్రవించింది.

తన కొడుక్కు ఎంత కష్టం వచ్చింది?

"అయ్యో అలాగా." అన్నాడుబాధగా–

ఆ తర్వాత ఆయన ఒక్క క్షణం ఏదో ఆలోచించి జేబులోవున్న నూటపాతికరూపాయలు తీసి కొడుకు చేతిలో వుంచుతూ "వెళ్ల త్వరగా మందులు కొనుక్కుని వెళ్ల." అన్నాడు

గబుక్కున ఆ డబ్బులు తీసుకున్న సుదర్శనం తండ్రిని ఏమీ అడగలేదు ఆయన యోగక్షేమాల గురించి అడగలేదు గబగబా వెళ్లిపోయాడు.

శేషాచలం తృప్తిగా శ్వాస పీల్చాడు ఆయన తండ్రి మనసు కుదుటపడింది

తన కొత్త బట్టల గురించి విశ్వనాథం అడక్కముందే ఆ నూటపాతిక రూపాయలనూ బజార్లో ఎవడో జేబు కొట్టాడని చెప్పాలను కున్నాడు శేషాచలం రోడ్డుమీద నడుస్తూ ★

